క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



కొండాపురం: మండల నూతన తహసీల్దార్‌గా సురేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బిట్రగుంట తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై కొండాపురం వచ్చారు. కొండాపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న కోటేశ్వరరావు లింగసముద్రానికి బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డీసీపల్లిలో 251 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 251 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 488 బేళ్లు రాగా 251 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.217.44 ధర పలికిందని వివరించారు. కాగా ప్రస్తుతం మార్కెట్లో అమ్ముడుపోయే ఒకటో నంబర్ మంచిపచ్చ, 2వ నంబరు ముదురులోని అడుగు పలచని ఆకులను మాత్రమే వేలానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. రెండో నంబర్‌ను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని, ఆ రకం కొనుగోలు చేస్తుంటే తెలియజేస్తామన్నారు. రైతులు ముందురోజు వచ్చి వేలాన్ని పరిశీలించుకుని అమ్మకానికి పోయే బేళ్లను మాత్రమే తీసుకురావాలన్నారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: మండల విద్యాశాఖ అధికారి-1గా తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వంఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తిప్పిరెడ్డిని ఎంఈఓ-1గా నియమిస్తూ పూర్తిఅదనపు బాధ్యతలను అప్పగించింది. నూతన ఎంఈఓకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వింజమూరు ఎంఈఓ-1గా పీ రమేష్



వింజమూరు(ఉదయగిరి): మండల విద్యాశాఖ అధికారి-1గా పీ రమేష్ మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంఈఓను ఎంఈఓ-2 మధుసూదన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేస్తున్న షేక్ షరీఫ్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా షరీఫ్ దంపతులను సహచర ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. 36 ఏళ్లుగా ఆంగ్ల ఉపాధ్యాయుడిగా అందించిన సేవలను కొనియాడారు. ఆయన శేషజీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ బోధనకు వలంటీర్ నియామకం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ కొరత ఉండడంతో వలంటీర్‌ను నియమించారు. వలంటీర్‌కు నెలకు రూ.10వేలు చొప్పున వేతనం అందించేందుకు గ్రామానికి చెందిన ఏ ఓబుల్‌రెడ్డి ముందుకొచ్చారు. గురువారం ఆయన వలంటీర్‌కు వేతనం రూ.10 వేలు నగదును అందజేశారు. హెచ్‌ఎం కనకారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జర్మన్ భాషపై ఉచిత శిక్షణ

వింజమూరు(ఉదయగిరి)/ఆత్మకూరు: ప్రభుత్వం బీఎస్సీ, జీఎన్‌ఎం నర్సింగ్ పట్టా కలిగిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మన్ భాషపై ఉచితంగా శిక్షణను అందిస్తోందని ఉదయగిరి ఏఎస్‌డబ్ల్యూఓ రమణారెడ్డి , ఆత్మకూరు ఎస్సీ వెల్ఫేర్ ఉన్నతా ధికారి కే బ్రహ్మానందాచారి గురువారం తెలిపారు. 35ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు శిక్షణకు అర్హులని చెప్పారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి నగరాల్లోని కేంద్రాల్లో పది నెలల పాటు శిక్షణను అందిస్తున్నారని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచితంగా వసతితో పాటు భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణానంతరం జర్మనీ దేశంలో ఉద్యోగావకావకాశాలు కల్పిస్తారని తెలిపారు. వార్షిక వేతనం రూ.2.40 లక్షల నుంచి రూ.3.10 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నర్సింగ్ చదివిన మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూరుశాతం ఉపాధి లక్ష్యాలను సాధించాలి

• డ్వామా పీడీ గంగాభవాని



విింజమూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ గంగాభవాని



ఆత్మకూరులో ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న డ్వామా పీడీ

ఉదయగిరి రూరల్/ఆత్మకూరురూరల్: ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని ఉపాధి సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో క్లస్టర్ పరిధిలోని ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మండలాల వారీగా ఉపాధి పనుల పురోగతిపై ఏపీఓలు సిబ్బందితో పీడీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కనీసం వంద సోక్‌పిట్‌లను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఆగస్టు చివరి నాటికి 90 శాతం నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 3,500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1,700 ఎకరాల్లో సాగుకు రైతులను గుర్తించడం జరిగిందన్నారు. మెట్టప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని మరో వేయి ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకుని రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు రెండు వేల గోకులం షెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలను త్వరితగతిన చేపడతామన్నారు. ఉపాధి పనుల్లో బినామీ మస్టర్లను అరికట్టేందుకు ఆగస్టు 10వ తేదీ తరువాత కూలీలకు రెండుపూట్ల ముఖహాజరును తప్పనిసరి చేస్తున్నామన్నారు. జిల్లాలో రూ.70 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వెంటనే చెల్లింపులు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ మృదుల, ఎంపీడీఓ అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని ఉపాధి సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో పీడీ గంగాభవాని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి లక్ష్యాల సాధనకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేయాలని సూచించారు. క్లస్టర్ ఏపీడీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ రఫీఖాన్, ఏపీఓలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ గంగాభవాని గురువారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసి గరిష్ట వేతనం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు తమకు గిట్టుబాటు వేతనం లభించడం లేదని పీడీ దృష్టికి తెచ్చారు. వర్షాలు లేనందున నేల గట్టిగా ఉండడంతో కొలతల మేరకు పని చేయలేకపోతున్నామని మొరపెట్టుకున్నారు. అనంతరం వింజమూరు చెరువులో ఫిష్‌పాండ్ పనులను పరిశీలించారు.

పనిభారాన్ని తగ్గించాలి

సోమశిల: అంగన్‌వాడీలపై పనిభారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతసాగరంలోని సీడీపీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తిరుపాల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు 2జీ ఫోన్లు ఇచ్చి యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ పనులు చేయాలని చెబుతోందని, నెట్ స్పీడ్‌లేక పనులు జరగడం లేదన్నారు. ఈ కారణంగా అంగన్‌వాడీలు మెమోలను అందుకుంటూ మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ఆగస్టు 1 నుంచి యాప్‌ల ద్వారా చేపట్టే పనులను నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం 5జీ సెల్‌ఫోన్లు అందించే వరకు రికార్డుల్లో మాత్రమే నమోదు చేస్తారన్నారు.

189 వితంతు పింఛన్లు మంజూరు

కావలి (జలదంకి): కావలి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా 189 వితంతు ఫించన్లు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం కావలి ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్యాప్టో ధర్నా జయప్రదానికి పిలుపు



ప్యాప్టో డిమాండ్ల కరపత్రాలను ప్రదర్శిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ప్యాప్టో కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయ సంఘాల సభ్యులతో సమావేశాన్ని పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్యాప్టో మాజీ అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ బదిలీలు జరిగి రెండు నెలలైనా ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమని, ఏకీకృత సర్వీసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎస్ రద్దు, 12వ పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి చెల్లింపు, పెండింగ్ బకాయిల విడుదల కోసం కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ప్యాప్టో జిల్లా కో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు బీ శివప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, మురళీకృష్ణ, ఎం సుబ్బారెడ్డి, షరీఫ్, శివరామిరెడ్డి, తిరుపతి రెడ్డి, ఖాజారెడ్డి, వెంగయ్య, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్లు



రైతులకు వ్యవసాయ డ్రోన్‌ను అందజేస్తున్న మంత్రి ఆనం

అనుమసముద్రంపేట: ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్లను అందజేస్తోందని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నబ్బీపురంలో గురువారం ఆయన పర్యటించారు. తొలుత కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ డ్రోన్లను పంపిణీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పది వ్యవసాయ గ్రూపులకు డ్రోన్ స్ప్రేయర్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. తొలుత ఆరు గ్రూపులకు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు రూ.2 లక్షలు చెల్లిస్తే ప్రభుత్వం రూ.8 లక్షలు సబ్సిడీని భరించి రూ.10లక్షల విలువైన డ్రోన్ స్ప్రేయర్లను అందజేస్తుందని వివరించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో కొత్తగా ఐదు వేల వితంతు పింఛన్లు మంజూరయ్యాయని లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవరెడ్డి, పీ సుధాకర్‌రెడ్డి, టీ గిరినాయుడు, వడ్డి కాలేషా, డాక్టర్ ఖాజామియా, ఏఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: మెట్టప్రాంత నిరుద్యోగ యువత కోసం ఆత్మకూరులో శుక్ర, శనివారాల్లో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నెల్లూరుపాళెంలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డీఆర్డీఓ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు టీ సతీష్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న మెగాజాబ్‌మేళాకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. సుమారు 70కుపైగా కంపెనీలు జాబ్‌మేళాకు హాజరవుతున్నాయి చెప్పారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తిచేసిన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి వెంట ఆర్డీఓ బీ పావని, పరిశ్రమల శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

దేవుడి మాన్యంలో తవ్వకాలపై ఆందోళన



చేజర్ల (సోమశిల): చేజర్ల మండలం కాకివాయిలోని కోటితీర్థం త్రికోటేశ్వరస్వామి ఆలయానికి చెందిన సుమారు 40 ఎకరాల భూమిని జీకే ల్యాండ్స్ ప్రైవేట్ సంస్థ వారు లీజుకు తీసుకున్నారు. దేవుని మాన్యాన్ని పాడుకున్నవారు పంటలు సాగులు చేయకుండా ఇష్టానుసారంగా భారీ గుంతలు తవ్వుతుండడంపై గ్రామస్తులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ మాన్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారని, సంబంధిత అధికారులు పరిశీలించి తవ్వకాలను నిలిపివేయించి పంటలు మాత్రమే సాగుచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపట్నుంచి పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

కావలి (జలదంకి): కావలి మండలం రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆగస్టు 2 నుంచి 5వ తేదీ వరకు పాలీసెట్-2025 స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సుశీల్‌కుమార్‌ప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లు పొందేందుకు పదోతరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్మీడియట్ తప్పిన, పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోని వారు కూడా అర్హులని తెలిపారు. అడ్మిషన్ కోసం వచ్చే అభ్యర్థులు పదో తరగతి మార్కుల బాబితా, టీసీ, కులం సర్టిఫికెట్లు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీసర్టిఫికెట్లు, పాలిసెట్ రాసి ఉంటే ర్యాంకు కార్డులతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదని, ఫీజు రూ.5800 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

ఉదయగిరి: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని సీపీఎన్‌డీటీ సబ్‌డివిజన్ బృంద సభ్యులు రవీంద్రనాథ్ ఠాగూర్, కలసపాడు వెంకటసుబ్బయ్య అన్నారు. ఉదయగిరిలోని వేణు నర్సింగ్ హోమ్‌లోని స్కానింగ్ సెంటర్‌ను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్‌లోని రికార్డులను, ఫారం-ఎఫ్ నివేదికలను పరిశీలించారు. ప్రతినెలా ఫారం-ఎఫ్ రిపోర్టును జిల్లా అధికారులకు సమర్పించాలని సూచించారు. స్కానింగ్ సెంటర్‌లోని సీపీఎన్డీటీ నిబంధనల ఫ్లెక్సీని పరిశీలించి సూచనలు చేశారు. ప్రతినెలా తమ బృందం స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తుందన్నారు. లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరంగా చర్యలు చేపడుతామని హెచ్చరించారు. వారి వెంట నర్సింగ్ హోమ్ వైద్యుడు వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

తెలుగుపండిట్‌కు సత్కారం



సీతారామపురం : బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ ప్రకాశరావు ఉద్యోగ విరమణ సభను గురువారం నిర్వహించారు. ఎంఈఓ మస్తాన్‌వలి ముఖ్యఅతిథిగా హాజరై ప్రకాశరావు సేవలను కొనియాడారు. అనంతరం ప్రకాశరావు దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఎంపీడీఓ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

•ఒకరికి గాయాలు

జలదంకి: స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో ఒకరు గాయాలపాలయ్యారు. వివరాలు.. కలిగిరి మండలం కాకుటూరుకు చెందిన షేక్ కబీర్ తన తండ్రి ఇమామ్ ఖాసీంతో కలిసి ఇంటి శంకుస్థాపనకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసేందుకు మోటార్‌సైకిల్‌పై కావలికి వెళ్తూ పెట్రోల్ పట్టించుకునేందుకు జలదంకి పెట్రోల్ బంకు వద్ద రోడ్డును క్రాస్‌చేస్తున్నారు. అలాగే తిరుపతికి చెందిన ఎరువుల కంపెనీ ఉద్యోగులు అద్దె కారులో జమ్మలపాలెంలో జరిగిన ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం జలదంకిలోని వ్యాపారులను కలుసుకునేందుకు కారులో వస్తూ కబీర్ మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కబీర్‌కు గాయాలయ్యాయి. తండ్రి ఖాసీం సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. జలదంకి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వర్లు సేవలు ఎనలేనివి



ఆత్మకూరు: స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ అటెండర్‌గా పనిచేస్తున్న శేషం వెంకటేశ్వర్లు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు,లలితమ్మ దంపతులను వైద్యసిబ్బంది ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఆర్‌ఎంఓ ఉషాసుందరి, వైద్యులు బాలాజీ, కిరణ్మయి, అనూషా, ఏఓ శ్రీనివాసులు రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

లారీ తగిలి టోల్‌బూత్ ధ్వంసం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజాలోని టోల్‌బూత్ లారీ తగలడంతో గురువారం ధ్వంసమైంది. టోల్‌బూత్‌లో సిబ్బంది లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గత నెల రోజుల వ్యవధిలో వాహనాలు తగిలి టోల్ బూత్‌లు ధ్వంసం కావడం ఇది మూడోసారి. ఇక్కడ టోల్‌బూత్‌లు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా టోల్‌ప్లాజా నిర్వాహకులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారిశ్రామికవాడ ఏర్పాటుకు గ్రామసభ

కలిగిరి: మండలంలోని పెదకొండూరు రెవెన్యూ పరిధిలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు గ్రామసభను తహసీల్దార్ ఎం గిరీష్ అధ్యక్షతన గ్రామసచివాలయంలో గురువారం నిర్వహించారు. సర్వే నంబర్ 739లో 606 ఎకరాల్లో పారిశ్రామికవాడను ఏర్పాటు చేసేందుకు యోగ్యమైన భూములు ఉన్నట్లుగా గుర్తించారు. వాటిని ఏపీఐఐసీకి అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని గ్రామసభలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను గ్రామస్తులు కోరారు. సర్పంచ్ మొక్కా సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆంక్షలను ఛేదించుకుని...



ఆత్మకూరురూరల్: వాసిలి వద్ద హైవేపై వాహనదారులను నిలిపి ప్రశ్నిస్తున్న ఎస్సై జిలానీ



నెల్లూరులో ఉదయగిరి నేతలను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



సంగంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

• నెల్లూరుకు తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు/ ఆత్మకూరురూరల్/ ఉదయగిరి / సంగం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరు పర్యటనకు రావడంతో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. జగన్ పర్యటన సందర్భంగా పోలీసులు అడుగడుగునా ఆంక్షలను విధించారు. ముందస్తుగా నాయకులకు నోటీసులను అందజేశారు. ప్రత్యేక వాహనాల్లో పార్టీ శ్రేణులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గురువారం ఏకంగా రహదారులపై చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వాహనాలను నిలిపి ఆధార్ కార్డులను పరిశీలించి ఎక్కడకు వెళ్తున్నారని ప్రశ్నిస్తూ అడ్డుకునేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మది నిండా జగన్‌పై అభిమానాన్ని నింపుకొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోలీసుల ఆంక్షలను ఛేదించుకుంటూ నెల్లూరుకు చేరుకున్నారు. తమ అభిమాన నేతను చూసి పులకించిపోయారు.

ఉదయగిరి నాయకుల అరెస్ట్

పోలీసుల ఆంక్షలను ఛేదించుకుని నెల్లూరుకు చేరుకుని జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు నడిచి వెళుతున్న ఉదయగిరి వైఎస్సార్‌సీపీ నేతలు అక్కి భాస్కర్‌రెడ్డి, కొండా రాజగోపాల్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదో నగర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బిల్లులు చేసుకునేందుకే కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరురూరల్: ప్రజా సమస్యల అజెండాగా కాకుండా కేవలం మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనులకు కౌన్సిల్ ఆమోదంతో బిల్లులు చేసుకునేందుకే చాలా రోజుల తరువాత మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారని సీపీఎం నేతలు ధ్వజమెత్తారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించడం ఏమిటన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు ఏమయ్యాయో సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. నెల్లూరుపాళెం నుంచి పాత ఎల్‌ఐసీ కార్యాలయం వరకు గ్రీనరీకి కొత్తగా రూ.45 లక్షలు నిధులు ఖర్చు చేసినట్లుగా చూపడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తాము ఆ ప్రాంతంలోని గ్రీనరీని పరిశీలించగా అక్కడ ఉన్న చెట్లకు, కేటాయించిన నిధులకు భారీ వ్యత్యాసం ఉన్నట్లుగా తెలిసిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో నిధుల దుర్వినియోగంపై ఎవరు బాధ్యతగా ప్రవర్తించకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, సీఐటీయూ జిల్లా నేత శివప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సందానీ, ఐద్వా మహిళ సంఘం నేత గుల్జార్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో మరోసారి బయటపడ్డ వర్గవిభేదాలు

కొండాపురం: మండల టీడీపీలో వర్గవిభేదాలు మరోసారి బయటపడ్డాయి. కొమ్మి పంచాయతీ రామానుజపురానికి చెందిన టీడీపీ నాయకుడు ఆకుల మాలకొండయ్యను పరామర్శించడానికి ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు గురువారం వచ్చారు. ఆయన గత పది రోజుల క్రితం మాలకొండయ్యను పరామర్శించేందుకు వస్తానని తన వర్గానికి తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముందుగానే తన వర్గానితో వచ్చి ఆకులను పరామర్శించి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి వెళ్లారు. కాగా కాకర్ల వెంట ఓ వర్గం, బొల్లినేని వెంట మరోవర్గం వారు ఉన్నారు. దీన్ని గమనించిన కొందరు నాయకులు టీడీపీలో వర్గవిభేదాలు తారాస్థాయికి చేరాయని గుసగుసలాడుకుంటూ కనిపించారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



మాట్లాడుతున్న సీడీపీఓ సునీత

ఉదయగిరి రూరల్: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో శుక్రవారం నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సీడీపీఓ సునీత పేర్కొన్నారు. గురువారం ఆమె తన కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆయాలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించాలని సూచించారు. తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించి చైతన్యపర్చాలన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలను బాధ్యతగా నిర్వహించాలన్నారు. యాప్‌లలో అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. ఉదయగిరి ప్రాజెక్టుకు నూతన సీడీపీఓను జిల్లా ఉన్నతాధికారులు నియమించారని, త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం



చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం చిత్తలూరు ఎస్సీ కాలనీలో తహసీల్దార్ మురళి అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం కట్టించి ఇచ్చిన పక్కాఇళ్లు ఉరుస్తున్నాయని, కాలనీలోని 45 కుటుంబాలకు కొత్తగా గృహాలను మంజూరు చేయించాలని, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ మహాసేనకు చెందిన బాబు, హౌసింగ్, పంచాయతీ, రెవెన్యూ, వెలుగు, సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.